# సత్యవాక్యము

# THE WORD OF TRUTH

# మీకొక సదవకాశము!

క్రీస్తు సంఘములు సమర్పించుచున్న 'సత్య వాణి' యను రేడియో కార్యక్రమముద్వారా లక్షలాది ప్రజలు గొప్ప ఆత్మీయ మేలులను పొంది యున్నారు. మరికొందరు మేము ప్రచురించిన తెలుగు పుస్తకములద్వారా మేలుపొంది యున్నారు.

మీరు బైబిలు సత్యములను సులువుగా గ్రహించు నిమిత్తము మేము ముద్రించిన సత్యవాణి రేడియో ప్రసంగములు, తదితర పుస్తకములు 25 రకములు మావద్ద ఉన్నవి. అవియేగాక రాబోవు రెండు సంవత్సరములలోను సత్యవాక్య మాసపత్రికను మీరు క్రమముగా పొందవలెనంటే ఈ దిగువ చిరునామాకు రూ. 10/- లు మాత్రము పోస్టేజీ ఖర్చులకు పంపించి మీ పేరు నమోదు చేయించుకొనండి! మీ యింటిలో ఒక మినీ క్రైస్తవ గ్రంథాలయాన్ని తెరవండి!!

**SATYA VANI**
(P.O. Box 80) Seshagiri Rao St.
KAKINADA–533 004

గమనిక :- మీరు M.O. పంపునప్పుడు, మాకు ఉత్తరములు వ్రాయునప్పుడు, మీ అడ్రసులో మార్పు కలిగినప్పుడు మీ సత్యవాక్య నంబరును మాకు తెలియజేయండి. ఇది అత్యవసరం!!

రాజన్ ఎలక్ట్రిక్ ప్రెస్, కాకినాడ.

# సత్యవాక్కు

## క్రైస్తవ మాసపత్రిక

పోస్ట్ బాక్స్ - 80, కాకినాడ - 533 001

ఎడిటర్ :
జె. సి. ఛోట్

మేనేజింగ్ ఎడిటర్ :
జాషువా గూటం

సంచిక 6 జనవరి 1985 సంపుటి 5


## సంపాదకీయము

### ఇద్దరు ఆదాములు

*(The Two Adams)*

బైబిలును ఎరిగిన వారమైతే ఆదికాండములో చెప్పబడిన మొదటి ఆదామును గూర్చి మనకు తెలిసే యుంటాది. లేఖనాల్లో అతని గూర్చి చదువకపోయినను, బైబిలు దేవుని గ్రంథమని వారు విశ్వసించకపోయినను అనేకులు అతని గూర్చి వినియున్నారు. నేల మంటినుండి అద్భుత రీతిగా దేవుడతని సృజించాడు, అతడు మొదటి మానవుడు. దేవుడతనికి సాటియైన సహాయమును అనగా హవ్వను సృజించాడు. వారిని ఏదెను వనంలో యుంచాడని మన మెరుగుదుము. వారు సర్పమువలన, అనగా సాతానువలన శోధింపబడ్డారు. నిషేధింప బడిన ఫలాన్ని తిన్నారు, పాపం చేసారు. అందువలన ఆత్మీయంగా మరణించారు, చివరకు భౌతికంగా కూడ మరణించారు అని మన మెరుగుదుము.

అవును మనం ఆ ఆదామునుగూర్చి ఎరుగుదుము. అయితే బైబిలు రెండో ఆదామునుగూర్చి చెప్పుచున్నదని నీ వెరుగుదువా?

1 కొరింథీ 15:21-23 ని ఇప్పుడు చదువుకొందాము : "మనుష్యుని ద్వారా మరణము వచ్చెను గనుక మనుష్యునిద్వారానే మృతుల పునరుత్థానమును కలిగెను. ఆదామునందు అందరు ఏలాగు మృతి పొందుచున్నారో, ఆలాగుననే క్రీస్తునందు అందరు బ్రదికింపబడుదురు; ప్రతివాడును తన వరుసలోనే బ్రదికింపబడును. ప్రథమ ఫలము క్రీస్తు; తరువాత క్రీస్తు వచ్చినప్పుడు ఆయన వారు బ్రదికింపబడుదురు". పౌలు ఇంకా ఈలాగున వ్రాసాడు : "ఇందు విషయమై ఆదామను మొదటి మనుష్యుడు జీవించు ప్రాణి ఆయెనని వ్రాయబడి యున్నది. కడపటి ఆదాము జీవింపచేయు ఆత్మ ఆయెను. ఆత్మ సంబంధమైనది మొదట కలిగినది కాదు; ప్రకృతి సంబంధమైనదే మొదట కలిగినది; తరువాత ఆత్మసంబంధమైనది. మొదటి మనుష్యుడు భూసంబంధియై మంటినుండి పుట్టినవాడు, రెండవ మనుష్యుడు పరలోకమునుండి వచ్చినవాడు. మంటినుండి పుట్టిన వాడెట్టివాడో మంటినుండి పుట్టినవారును అట్టివారే. పరలోక సంబంధి యెట్టివాడో పరలోక సంబంధులును అట్టివారే. మరియు మనము మంటినుండి పుట్టినవాని పోలికను ధరించిన ప్రకారము పరలోక సంబంధి పోలికయు ధరింతుము" (1 కొరింథీ 15:45-49).

లేఖనాలను చదువుచున్నప్పుడు క్రీస్తు యితర బైబిలు వ్యక్తులతో పోల్చబడినట్లు చూడగలము. అందులో మెల్కీసెదెకు ఒకడు. హెబ్రీ 5-7 అధ్యాయములలో గొప్ప దైవజనుడైన అబ్రాహాము యాజక రాజైన మెల్కీసెదెకుకు పదియవ వంతు చెల్లించినట్లు చదువగలము. అతడు దేవుని ప్రధాన యాజకుడని చెప్పబడినది. అతనిగూర్చి మనకెక్కువ తెలియదు. అతడెక్కడివాడో, ఎక్కడ జన్మించాడో, తలిదండ్రులెవరో, అతనికేమి జరిగినదో మనకు తెలియదు, మెల్కీసెదెకుకు భూసంబంధ తలిదండ్రులు లేరని కాదుగాని, వారిని గూర్చిన రికార్డు యేమీ లేదు. అయితే క్రీస్తుకు అతనికి కొన్ని సంగతులు సమానముగ యున్నవి. వారిద్దరు ప్రధాన యాజకులు, ఇద్దరికీ ఆద్యంత

ము లు లేవు మొదలగునవి. మరల మోషే గొప్ప నాయకుడు. ధర్మ శాస్త్రదాత గనుక క్రీస్తు మోషేతో పోల్చబడ్డాడు (యోహాను 1:17).

ఇప్పుడు మనం ఇద్దరు ఆదాములను చూద్దాం. వారిద్దరికీ చాల పోలికలున్నవి. మరల వారొకనిని మరొకనితో పోల్చుటవలన వ్యత్యాసములను కూడ కొన్నింటిని చూడగలము. వీటిలో కొన్నింటిని ఇప్పుడు చూద్దాం.

మొదట్లో ఆదాము చేయబడినను, రెండవ ఆదామగు క్రీస్తు ఒక నూతన ఆరంభమును కొనితెచ్చాడు. ఒక క్రొత్త చట్టము (హెబ్రీ 10:8-10), క్రొత్తజన్మ (యోహాను 3:3-5), క్రొత్త రాజ్యము (హెబ్రీ 12:23), క్రొత్త నామము (యెష 62:2), క్రొత్త జీవితం (2 కొరింథీ 5:17) యిచ్చాడు. ఆదాము అద్భుతంగా సృజింపబడ్డాడు (ఆది 1:26, 27). క్రీస్తు కన్యయైన మరియకు అద్భుతరీతిగా జన్మించాడు (మత్త 1:18-25). ఆదాము నేల మంటినుండి సృజింపబడ్డాడు (ఆది 2:7), కాని క్రీస్తు పరలోకమునుండి వచ్చాడు (యోహాను 3:13), మనము మొదటి ఆదాముయొక్క స్వరూపమును కలిగియున్నామని, అంటే భౌతిక శరీరాలను కలిగి యున్నామని పౌలు చెప్పుచున్నాడు. అయితే ఆత్మీయంగా, మనం క్రీస్తు అనుచరులమైతే మనం ఆయన స్వరూపాన్ని కలిగియుందుము, ఆయనవలె యుండుటకు ప్రయత్నింతుము (1 కొరి 15:49). ఆదాము దేవునికి అవిధేయుడగుటవలన అతడు పాపి అయ్యాడు (ఆది 3). కాని క్రీస్తు పాపంలేకుండా జీవించాడు. పరిపూర్ణుడు (హెబ్రీ 4:15; 1 పేతురు 2:22). ఆదాము యొక్క పాపమువలన మానవుడు మంచిచెడ్డలను గ్రహించుకొనేవాడయ్యాడు. అందువలన అతని క్రియలకు బాధ్యుడయ్యాడు. దేవునికి అవిధేయుడగుటవలన పాపి అయ్యాడు. అతనికి రక్షకుడవుసరమయ్యాడు (రోమా 3:23). క్రీస్తు దేవుని కుమారుడై నందునను, పరిపూర్ణ జీవితం జీవించినందునను రక్షకుడయ్యాడు (యోహాను 3:16, 1 యోహా

4:14). ఆదామునందు అందరు మృతి పొందుదురు గాని క్రీస్తునందు మనం బ్రతికింపబడుదుమని చెప్పబడింది (1 కొరి 15:22). చివరిగా, ఆదాము భూసంబంధియైనందునను, మరణం అందరికీ సంప్రాప్తమైనందునను శరీరమందు నిరీక్షణ ఏమీ లేదు గాని ఆయనకు విధేయులైన వారందరికీ క్రీస్తు యిచ్చు రక్షణలోను, పునరుత్థానమును గూర్చిన వాగ్దానములోను నిత్య నిరీక్షణ యున్నది (రోమా 6:23; యోహాను 14:1-3).

ఆదామునందు మానవుడు బలహీనుడు గాని క్రీస్తునందు మనం బలవంతులం (మత్త 26:41; ఎఫెసీ 6:10). ఆదామునందు మనం యేమి పోగొట్టుకొన్నామో క్రీస్తునందు సంపాదించుకొన్నాము. పౌలు ఇట్లు చెప్పాడు: "అయినను ఏవేవి నాకు లాభకరములై యుండెనో వాటిని క్రీస్తు నిమిత్తము నష్టముగా ఎంచుకొంటిని. నిశ్చయముగా నా ప్రభువైన యేసుక్రీస్తును గూర్చిన అతి శ్రేష్ఠమైన జ్ఞానము నిమిత్తమై సమస్తమును నష్టముగా ఎంచుకొనుచున్నాను. క్రీస్తును సంపాదించుకొని ధర్మశాస్త్రమూలమైన నా నీతిని గాక, క్రీస్తునందలి విశ్వాసమువలననైన నీతి, అనగా విశ్వాసమునుబట్టి దేవుడనుగ్రహించు నీతిగలవాడనై ఆయనయందు అగపడు నిమిత్తమును, ఏవిధముచేతనైనను మృతులలోనుండి నాకు పునరుత్థానము కలుగవలెనని, ఆయన మరణ విషయములో సమానానుభవముగలవాడనై ఆయనను, ఆయన పునరుత్థాన బలమును ఎరుగు నిమిత్తమును, ఆయన శ్రమలలో పాలివాడనగుట యెట్టిదో యెరుగు నిమిత్తమును, సమస్తమును నష్టపరచుకొని వాటిని పెంటతో సమానముగ ఎంచుకొనుచున్నాను. ఇదివరకే నేను గెలిచితినని యైనను, ఇదివరకే సంపూర్ణసిద్ధి పొందితినని యైనను నేను అనుకొనుటలేదు గాని, నేను దేని నిమిత్తము క్రీస్తు యేసుచేత పట్టుబడితినో దానిని పట్టుకొనవలెనని పరుగెత్తుచున్నాను. సహోదరులారా, నేనిదివరకే పట్టుకొనియున్నానని తలంచుకొనను. అయితే

ఒకటి చేయుచున్నాను. వెనుకఉన్నవి మరచి ముందున్న వాటికొరకై వేగిరపడుచు క్రీస్తు యేసునందు దేవుని ఉన్నత పిలుపునకు కలుగు బహుమానమును పొందవలెనని గురియొద్దకే పరుగెత్తుచున్నాను" (ఫిలిప్పీ 3:7-14).

ఇప్పుడు నీ విశ్వాసాన్ని యెవరియందుంచుచున్నావు— మొదటి ఆదామునందా? రెండవ ఆదామునందా? విచారకరమైన సంగతి యేమంటే ప్రపంచములో నేడు అనేకులు నేటికొరకే జీవించు చున్నారు, మానవుని అనుసరించుచున్నారు, ఈ లోకంలో యేమి దొరుకుతాదో యని మాత్రమే ఆలోచించుచున్నారు. ఇదొక పొర బాటు. మానవుని, అతని సమస్యలను, అపజయాలను, అవుసరా లను గమనించుము. అతడు సాధించిన గొప్ప సంగతుల్లో కూడ సంతృప్తి లేదు, ఆదరణ లేదు, మరో జీవితంయొక్క హామీ లేదు. గనుక జ్ఞానియైనవాడు వెనుకకు గాక ముందుకే చూస్తాడు, క్రిందికి గాక పైకే చూస్తాడు, మానవునియందు ఈలోకమందు గాక క్రీస్తునందు, రాబోవు లోకమందు విశ్వాసముంచుతాడు. మానవునికి నేడు, రేపు, నిత్యము కూడ జవాబు క్రీస్తే. ఆదామునందు మనం ఓడిపోతాం గాని క్రీస్తునందు విజయం సాధిస్తాం. దీన్ని బైబిలు బోధించుచున్నది, దీన్ని మేము నమ్ముచున్నాము. దీన్ని నీవు కూడా అంగీకరిస్తావనే మా నిరీక్షణ.

---

## నూతన జీవితము
## *(New Life)*

"ఎవడైనను క్రీస్తునందున్న యెడల వాడు నూతన సృష్టి" (2 కొరింథి 5:17). "మునుపటి ప్రవర్తన విషయములోనైతే, మోస కరమైన దురాశలవలన చెడిపోవు మీ ప్రాచీన స్వభావమును వదలు కొని, మీ చిత్తవృత్తియందు నూతనపరచబడినవారై, నీతియు

యథార్థమైన భక్తియు గలవారై, దేవుని పోలికగా సృష్టింపబ నవీన స్వభావమును ధరించుకొనవలెను" (ఎఫెసీ 4:22-24). "ఒకని ఒకడు అబద్ధమాడకుడి. ఏలయనగా ప్రాచీన స్వభావమును దా క్రియలతో కూడ మీరు పరిత్యజించి, జ్ఞానము కలుగు నిమిత్తము దానిని సృష్టించినవారి పోలిక చొప్పున నూతన పరచబడుచున్న నవీ స్వభావమును ధరించుకొని యున్నారు. ఇట్టి వారిలో గ్రీసు దేశస్థుడని యూదుడని భేదము లేదు...... దాసుడని స్వతంత్రుడని లేదుగాని క్రీస్తే సర్వమును అందరిలో ఉన్నవాడునై యున్నాడు" (కొలస్స 3:10-12).

దేవుడు మానవులనుండి మారుమనస్సు, నూతన జీవితమును కోరుచున్నాడు. మీరు మారుమనస్సు పొందనియెడల మీ రందరు ఆలాగే నశింతురని క్రీస్తు ప్రభువు చెప్పెను (లూకా 13:3).

మారుమనస్సు పొందుటకు ఒక ప్రత్యేకమైన తేదీగాని, నె గాని, సంవత్సరముగాని లేదు. ప్రభువును విశ్వసించినవారు వెంటనే తత్క్షణమే, రోజులు వాయిదాలు లేకుండా మారుమనస్సు పొందవలెను యిది దేవుని చిత్తమై యున్నది.

కొన్ని మతశాఖలవారు వారి సంఘములలో డిశంబరు 31వ తేదీ రాత్రి క్రొత్త సంవత్సరము నెదుర్కొనుటకు "వాచ్ నైట్" సర్వీసును ఏర్పాటు చేయుచున్నారు. ఆ రాత్రి ప్రతి ఒక్కరు లేచి నిలబడి, పాత సంవత్సరములో పాత క్రియలను విడిచిపెట్టి నూతన సంవత్సరములో నూతన జీవితము జీవించెదనని సాక్ష్యమిచ్చుట చాలా మందికి తెలిసిన విషయమే. వారు ఆ పాత సంవత్సర ప్రారంభములో ఈవిధమైన సాక్ష్యమునే ఇచ్చి యుండవచ్చును. పాతసంవత్సరము ఒకనాటి నూతన సంవత్సరమే అను విషయము వారు మరచిపోయి యుందురు.

మారుమనస్సు సంవత్సరమునకు ఒకసారి పొందునది కాదు

ఒక క్రైస్తవుడు పాపము చేసినప్పుడు, ఆ పాపము విషయమై మారు మనస్సు పొంది ప్రార్థించవలసి యున్నది. "అతిక్రమములను దాచిపెట్టు వాడు వర్ధిల్లడు. దానిని ఒప్పుకొని విడిచిపెట్టువాడు కనికరము పొందును" (సామె 28:13). దావీదు పాపము చేసి, నేను పాపము చేసితినని దేవుని యెదుట ఒప్పుకొని ప్రార్థించెను. కనికరము పొందెను.

నూతన జీవితము ప్రారంభించుటకు ఒక ప్రత్యేకమైన తేదీ లేక ముహూర్తము అవసరము లేదు. వెంటనే మారుమనస్సు, బాప్తిస్మము పొంది ప్రారంభించవలసి యున్నది. "గనుక నీవు తడవు చేయుట ఎందుకు? లేచి ఆయన నామమునుబట్టి ప్రార్థనచేసి బాప్తిస్మము పొంది నీ పాపములను కడిగివేసికొనుము" (అ. కా. 22 : 16). నూతన జీవితము ప్రారంభించుము.

—E. K. V. ప్రసాదరావు, చెయ్యేరు.

---

## దేవుడు అదృశ్యుడు

బాహ్యప్రపంచములో కంటికి కన్పించనివి అనేకములున్నవి. కంటికి కన్పించనంతమాత్రమున అవి లేవని చెప్పజాలము. కంటికి కనబడకయే ఉన్నవాటిని అదృశ్యవాస్తములందుము. కంటికిమాత్రమే కాదు, పంచేంద్రియములకునహా అందని వాస్తవములు ప్రకృతిలో ఉన్నవి. విద్యుత్తు (Electricity), ఈథర్ (Ether) మొదలగునవి ఇట్టి వాస్తవములే.

పరిస్థితులనుబట్టి కొన్ని వాస్తవములు అదృశ్యముగా ఉన్నవి. మెదడు, గుండె మొదలగు అంతరింద్రియములు వాటి అమరికను బట్టి అదృశ్యముగా నున్నవి. మనకు వ్యాధిని కలిగించు అనేక రకములైన సూక్ష్మజీవులు వాటి పరిమాణమునుబట్టి అదృశ్యముగా నున్నవి. ఆకాశ మహావిశాలములో ఉన్న అనేక నక్షత్రములు, నక్షత్రరాసులు

వాటి దూరమునుబట్టి అదృశ్యముగా ఉన్నవి. ఆయా పరికరము
ద్వారా వాటి ఉనికిని, చర్యలను గుర్తింపనగును. గత కాలము
అదృశ్యముగా ఉన్న అనేక విషయములు నవీన యంత్ర సహాయ
వలన నేటి మానవుడు చూడగలుగుచున్నాడు. దాదాపు
యన్నియు భౌతికపదార్థములకు సంబంధించినవే.

అయితే భౌతికపదార్థములకు సంబంధింపకయే ఉన్న కొ
వాస్తవములు అదృశ్యముగా నున్నవి. మానవదేహములో నివసిం
ప్రాణమునుగూర్చి నీకేమి తోచుచున్నది? అది అదృశ్య వాస్తవ
కదా! సకల జీవులలో ప్రాణమున్నను, అది ఏరూపములో ఉన్నదో
ఏ పరిమాణములో ఉన్నదో ఎవరికిని తెలియదు. మృతదేహము
ఏ అవయవలోపము లేకున్నను, సజీవచర్యలు లోపించును. సజీవచర్య
వలననే ప్రాణముయొక్క ఉనికిని తెలిసికొనగలుగుచున్నాము; దా
వేరుగా దాని ఉనికిని తెలిసికొనగలమా? ప్రాణము అదృశ్య వా
వము గనుక, అది దేహమును వదలిపోవునప్పుడు ఏ రూపములో
ఏలాగు వెడలిపోవునో కూడ తెలియకున్నది.

ఆలాగే మానవదేహములో పదార్థమునకు సంబంధింపక
ఉన్న మరికొన్ని అదృశ్య వాస్తవములున్నవి. ఆత్మయొక్క ఉని
అంగీకరింపని "అయోమయవాదులు" కూడ మనస్సు, హృదయము
వాస్తవములను కాదనలేరు. హృదయము గుండెకాదు; మనస్సు
మెదడు కాదు. ప్రాణ మెట్లు తన చర్యలవలన ప్రత్యక్షపర
కొనునో, హృదయము, మనస్సు అనునవికూడ అట్లే తమ్మును తా
బయలుపరచుకొనును. వీటినిబట్టి పదార్థమునకు సంబంధించిన రూప
లేకయే అదృశ్య వాస్తవములున్నవనియు, వాటిని కేవలము వా
చర్యలవలననే గుర్తింపగలమనియు, వాటి చర్యలకు వేరుగా వా
ఉనికిని తెలిసికొను అవకాశము లేదనియు గ్రహించితిమి.

ఆలాగే దేవుడు ఆత్మ (యోహాను 4:24); ఆయన అదృశ్యు

వాస్తవమై యున్నాడు. పదార్థగహితమైన అదృశ్య వాస్తవములు తమ ఉనికిని ఎట్లు రుజువు చేసికొనుచున్నావో అట్లే దేవుడు తన ఉనికిని రుజువు చేసికొనుచున్నాడు. "దుర్నీతిచేత సత్యమును అడ్డగించు మనుష్యులయొక్క సమస్త భక్తిహీనత మీదను, దుర్నీతి మీదను దేవుని కోపము పరలోకమునుండి బయలుపరచబడుచున్నది; ఎందుకనగా దేవుని గూర్చి తెలియశక్యమైనదేదో అది వారి మధ్య విశదమై యున్నది; దేవుడు అది వారికి విశదపరచెను. ఆయన అదృశ్య లక్షణములు, అనగా ఆయన నిత్యశక్తియు, దేవత్వమును జగదుత్పత్తి మొదలుకొని సృజింపబడిన వస్తువులను ఆలోచించుటవలన తేటపడుచున్నది". ఏమిచేయుటవలన? జగదుత్పత్తి మొదలుకొని సృజింపబడిన వస్తువులను ఆలోచించుటవలన ఆయన అదృశ్య లక్షణములు అనగా ఆయన నిత్యశక్తియు, దేవత్వమును తేటబడుచున్నవి (రోమా 1:18-20).

అదృశ్య దేవుడు తన సృష్టి ద్వారా తన్ను ప్రత్యక్షపరచుకొనుచున్నాడు. "ఆకాశములు దేవుని మహిమను వివరించుచున్నవి; అంతరిక్షము ఆయన చేతి పనిని ప్రచురపరచుచున్నది" (కీర్తనలు 19:1). విద్యుద్దీపపు కాంతిలో తన పుస్తకమును చదువుచు, విద్యుత్పంకా క్రింద కూర్చుండి దాని గాలిని అనుభవించుచు, "కరంటు లేదు" అన్న వానిని నీ వెప్పుడైనను చూచితివా? అట్టి వానినిగూర్చి నీ వేమందువు? అలాగైతే సూర్య వెలుగును, చంద్రకాంతి, గాలి, వర్షము మొదలగు వాటిని అనుభవించుచునే దేవుడు లేడనువానిని గూర్చి నీ వేమందువో !!

తన నిజరూపములో విద్యుత్తు అగోచరమైనది. దానితో నిరంతరము సంబంధముగల ప్రముఖ మేధావులకు సయితము తన ఉనికిని తన చర్యలవలననే బయలుపరచుకొనును. విద్యుత్తు పంకా కాదు; అగ్ని కాదు; వేడి కాదు; యంత్రము కాదు; అయితే అది తన

ఉనికిని దీపములు వెలిగించుట, మంట మండించుట, వేడి పుట్టించు యంత్రమును నడిపించుట, మొదలగు చర్యలద్వారా తన్ను తా ప్రత్యక్షపరచుకొన్నట్లే, అదృశ్య దేవుడు తన ఉనికిని తాను నిర్మించి సృష్టిద్వారా బయలుపరచుకొనుచున్నాడు.

"దేవునికి కోపము పుట్టించువారు నిర్భయముగా నుందురు వారు తమ బాహుబలమే తమకు దేవుడనుకొందురు. అయినను మృగ ములను విచారించుము, అవి నీకు బోధించును. ఆకాశపక్షులను విచా రింపుము, అవి నీకు తెలియజేయును. భూమినిగూర్చి ధ్యానించినయెడల అది నీకు బోధించును, సముద్రములోని చేపలు నీకు దానిని వివరిం చును. వీటన్నిటిని బట్టి యోచించుకొనినయెడల యెహోవా హస్తము వీటిని కలుగజేసెనని తెలిసికొనలేనివాడెవడు? జీవరాసుల ప్రాణము మనుష్యులందరి ఆత్మలును ఆయన వశముననున్నవిగదా?" (యోబు 12:6-10).

సృష్టికర్తయైన దేవుడు ఆత్మ గనుక ఆయన అదృశ్య వాస్తవమై యున్నాడు. అట్టి అదృశ్య దేవుని లక్షణములు, అనగా ఆయన నిత్య శక్తియు, దేవత్వమును, జగదుత్పత్తి మొదలుకొని సృజింపబడిన వస్తు వులను ఆలోచించుటవలన తేటబడుచున్నవి గనుక ఆయన ఉనికి నిరాకరించువారు నిరుత్తరులై యున్నారు.

—G. శ్రీవిద్యా, మద్రాసు-1

---

బైబిలుగ్రంథం దేవుని వాక్యం-5

## ప్రవచనముల నెరవేర్పు

## (*Fulfillment of Prophecies*)

(గత సంచిక తరువాయి)

### యూదులను గూర్చిన ప్రవచనము

అబ్రాహాము కుమారులను గూర్చిన ప్రవచనములలో కొన్ని

గమనించకుండగ ప్రవచనముల నెరవేర్పు అను ఈ అంశాన్ని మనం ముగించ జాలము. బైబిలు దేవుని వాక్యమని నమ్మటకు వేరే కారణాలు మనకు లేకపోతే యూదులే దాన్ని సంతృప్తి చేయగలరు.

క్రీస్తుకు 15 వందల సంవత్సరములకు ముందు యెరూషలేము నాశనాన్ని గూర్చియు, యూదులు చెదరగొట్టబడుటను గూర్చియు మోషే అతి ఖచ్చితముగా ప్రవచించాడు. దాన్ని బైబిలులో ద్వితీయోపదేశ కాండము 28:49-68 వరకు చదువవచ్చును. జోసిఫస్ వ్రాసిన చరిత్రను మనం చదివితే ఈ ప్రవచనములు సంపూర్తిగ ఎట్లు నెరవేరెనో మనము తెలిసికోగలము. వాటిలో కొన్నింటిని ఇప్పుడు చూద్దాం :

వారిపైకి యెహోవా దూరముగనున్న భూదిగంతములనుండి జనమును రప్పించనున్నట్లు మోషే చెప్పాడు (ద్వితీ 28:49).

యేసుక్రీస్తు ఈ లోకమందున్నప్పుడు యూదులు రోమా సామ్రాజ్యాధికారము క్రింద నున్నారను సంగతి ప్రతి బైబిలు విద్యార్థి ఎరిగినదే. యూదులు తిరుగుబాటు జరిపిన ఇంచుమించు క్రీ॥శ॥ 70 సంవత్సరముల వరకు ఇది కొనసాగింది. అప్పుడు రోమీయులు మొదట వెస్పేషియన్ క్రిందను తరువాత తీతు ఆధిపత్యము క్రిందను యెరూషలేమును వశము చేసికొనిన వారి సైన్యము సందనేకులు బ్రిటీషు సామ్రాజ్యము నుండియు, ఫ్రాన్స్ నుండియు వచ్చిన వారగుటచే నాడు వారు భూదిగంతములనుండి వచ్చిన వారుగ ఎంచబడిరి.

దండయాత్ర జరుపు సైన్యములు క్రూరులై యౌవనులను, వృద్ధులను కటాక్షించరని ప్రవచింపబడెను (50 వచనము).

జోసిఫస్ చరిత్రకారుని ప్రకారము ఆ సమయమందు జరిగిన వధ మిక్కిలి ఘోరమైనది. రోమీయులు స్త్రీలను పురుషులను బిడ్డలను అందరిని ఒకే విధముగ పొడిచి చంపిరి. వారి రక్తము యెరూషలేము వీధులగుండా ప్రవహించునంతటి భయంకర హత్యాకాండము జరిగెను.

కరువు అమితముగా నుండుటచే తల్లులు తమ స్వంత పిల్ల మాంసమునే తిందురని ప్రవచింపబడెను (53 వచనము)

కొందరు ఆకలిగొనిన దొంగలు ఆహారపు వాసననుబట్టి ఒక యింటిలోనికి వెళ్ళగా అక్కడ జరిగిన సంఘటన నొకదానిని జోసీఫస్ చరిత్రకారుడు వ్రాసాడు. తినడానికి వారికేమైనా ఆహారాన్ని ఇయ్య మని ఈ దొంగలు కోరగా ఒక పళ్ళెములో సగం భక్షించి యుంచి బిడ్డను వారికా యింటి స్త్రీ యిచ్చింది! ఆభయంకర దృశ్యాన్ని చూ దానిని ఆమెయే తినునట్లు ఆ దొంగలు పారిపోయారు.

ఆ దండయాత్రలో యూదులు బహు శ్రమలను, బాధలు పొందుదురని ప్రవచింపబడెను (59-61 వచనములు).

జోసిఫస్ ప్రకారము – ఖడ్గబారునుండి తప్పించుకొనినవా అంతకంటె ఘోరమైన క్షుద్బాధతోను, రోగములతోను పీడితులై మరణించారు. చనిపోయినవారిని పాతిపెట్టుటకే ఎవరును లేనందున ఆ పట్టణ వీధులన్నీ శవాలతో నిండెనని అతడు వ్రాసాడు. పిన్నలు పెద్దలు కరువుచే బాధింపబడినవారై మృత్యువుకొరకు ఆసక్తితో ఎదురు చూచేవారు.

యూదులు తాము స్వాధీనపరచుకొనిన దేశములోనుండి పె వేయబడి అనేక దేశములందు చెదరగొట్టబడుదురనియు, అక్క కూడ వారికి నెమ్మదిలేక బాధ, మనోవేదన ఉండుననియు ప్రవచిం బడెను (63-67 వచనాలు).

వర్తమాన, భూతకాల చరిత్ర ఈ ప్రవచనాన్ని సంపూర్తి నెరవేర్చింది. క్రీ॥శ॥ 70 సంవత్సరములో యెరూషలేము నాశనము చేయబడిన తరువాత యూదులు అక్కడనుండి పెరికివేయబడగా అనేక దేశములలోనికి చెదరిపోయిరి. వారు చెదరగొట్టబడిన దేశము లలో కూడ వారికి శాంతి లేక మనోవేదనలో యున్నారు.

# యూదుల శాశ్వత ఉనికి

యూదులు ఎన్నడు సంపూర్ణముగా నాశనము చేయబడరనియు, వారిని హింసించువారు కఠినముగా శిక్షింపబడుదురనియు ప్రవచింపబడెను (యిర్మీయా 30:11). అబ్రాహాముతో దేవుడు "నిన్ను ఆశీర్వదించు వారిని ఆశీర్వదించెదను, నిన్ను దూషించు వారిని శపించెదను" అని చెప్పాడు (ఆది 12:13).

యూదులు ఎంత తెగక బాధింపబడినను కొన్ని జాతులవలె వారు సమూల నాశనం కాలేదు. వారి నొకానొకసారి బాధించిన మోయాబీయులు, అమోనీయులు, ఫిలిప్పీయులు సమూలాగ్రముగ కొట్టుకొని పోయిరి. అష్షూరు ప్రజలు, బబులోనీయులు నాశనము చేయబడిరి. అట్లుగాక యూదులు ఇంకను దేవుని యనుగ్రహము చొప్పున జీవించుచున్నారు. బైబిలు మానవమాత్రులదే యని మనలను నమ్మించ ప్రయత్నించు నాస్తికుల ఆక్షేపణలకు వారు వ్యతిరేకముగా యున్నారు. ఎన్నడైనను యే దేశమైనను యూదులకు మేలుచేస్తే ఆ దేశము అభివృద్ధి జెందింది. ఏయే దేశములు యూదులను హింసించెనో అవి తగు శిక్ష ననుభవించాయి.

బైబిలు భగవదుద్రేకపూరితమైనదని చెప్పుటకు ఋజువు ఏమిటని అడుగగా ఒకడు 'యూదులు' అని జవాబిచ్చాడు. యూదులు భూమిమీద యున్నంతవరకు బైబిలు దైవ ప్రేరితమైనదని మనము చెప్పనవసరము లేదు.

ఇప్పటివరకు అనేక ప్రవచనములను, వాటి నెరవేర్పును గత రెండు సంచికలలో మనం గమనించాము. వాటిని బట్టి మనం ఇప్పుడొక ముగింపుకు రావాలి. మానవులు ఎవరి సహాయము లేకుండగనే ఈ ప్రవచనములను వ్రాసారా? నిస్సహాయులై ప్రవచించియు విఫలులయ్యారు గదా! బైబిలు గ్రంథకర్తనుగూర్చి ఒకేఒక్క న్యాయానుసారమైన జవాబు గలదు; "ఏలయనగా ప్రవచనము ఎప్పుడును మను

ష్యుని ఇచ్ఛనుబట్టి కలుగలేదు గాని మనుష్యులు పరిశుద్ధాత్మవలన ప్రేరేపింపబడినవారై దేవుని మూలముగ పలికిరి" (2 పేతురు 1:21).

—మోరిస్ బెయిలీ.

---

ఆమె నారి యనబడును - 2

## భార్యగా యుండుట అంటే .... ?

### *(To be a wife)*

భార్యగా యుండుట అంటే యేమిటి? పెళ్ళిరోజు కొరకు యౌవన స్త్రీలు సంతోషానందములతో ఎదురు చూస్తారు ఆ ప్రత్యేక దినము కొరకు తలిదండ్రులతో కలసి వాళ్లు ఎదురుచూస్తారు. ఎంతో సంకల్పిస్తారు. అనేకులు ఇందుకొరకు డబ్బును నిలువ వేస్తారు, గృహ పరికరాలు కొంటారు. వాటిని ఆ రోజువరకు జాగ్రత్తగా దాస్తారు. వధువుకొరకని చీరలు, బట్టలు, ఆభరణాలు మొదలగునవి కొని యుంచుతారు. అందరి దృష్టి 'వివాహం' అనే గొప్ప సంఘటనపై కేంద్రీకరించబడతాది.

అయితే పెండ్లి అయిన తరువాత యేమిటి? భార్యగా యుండుట అంటే నిజంగా యేమిటి?

వివాహము 'ప్రేమ వివాహం' అయితే భార్యాభర్తలిరువురు కలసి ఎదుగుట, ఒండొరుల ప్రేమలో దీర్ఘముగా ఎదుగుట, ఒండొరులను బాగా గ్రహించుకొనుట జరుగును. ఇంతకు ముందు కనబడని లోపాలు, బలహీనతలు కొన్ని బయటపడుటకూడా జరుగును.

పెద్దలు చూచి చేసిన పెళ్లిలో (Arranged Marriage) ఈ సవాళ్లు ఇంకా ఎక్కువ ఉంటాయి. వధువు అకస్మాత్తుగా ఒక క్రొత్త పురుషునికి భార్య అవుతాది. తనకు తెలియని ఒక క్రొత్త కుటుంబములో సభ్యురాలవుతాది. ఆ వివాహములో ఆమె సంతో

మంగా యుంటే భావార్థకమైన మన స్తత్వం కలిగి, మొదటి దినంనుండి మంచి జీవితం కొరకు నిర్మిస్తాది.

ఏ రకమైన వధువుకైనా, ఆమె నడిపింపుకొరకు లేఖనాల్లో విశేషమైన హెచ్చరికలీయబడినవి. వృద్ధస్త్రీలు యౌవన స్త్రీలకు బోధించాలి. "యౌవన స్త్రీలు తమ భర్తలకు లోబడియుండి తమ భర్తలను శిశువులను ప్రేమించువారును స్వస్థబుద్ధిగలవారును పవిత్రులును ఇంట ఉండి పనిచేసికొనువారును మంచివారునై యుండవలెనని" వారికి బోధించాలి (తీతు 2:4, 5).

ఎఫెసీ 5:22, 23 లో భార్యలకు ఈవిధంగా హెచ్చరిక లీయబడినవి: "స్త్రీలారా, ప్రభువునకువలె మీ సొంతపురుషులకు లోబడియుండుడి. క్రీస్తు సంఘమునకు శిరస్సైయున్నలాగున పురుషుడు భార్యకు శిరస్సైయున్నాడు".

స్త్రీ తన భర్తవలన ప్రేమించబడి, పోషించబడి, సంరక్షింపబడుట చాల గొప్పసంగతి. "పురుషులారా, మీరును మీ భార్యలను ప్రేమించుడి. అటువలె క్రీస్తుకూడ సంఘమును ప్రేమించి అది కళంకమైనను ముడతయైనను అట్టిది మరి ఏదైనను లేక పరిశుద్ధమైనదిగాను నిర్దోషమైనదిగాను మహిమగల సంఘముగాను ఆయన తన యెదుట దానిని నిలువబెట్టుకొనవలెనని వాక్యముతో ఉదకస్నానముచేత దానిని పవిత్రపరచి పరిశుద్ధపరచుటకై దానికొరకు తన్నుతాను అప్పగించుకొనెను. అటువలెనే పురుషులుకూడ తమ సొంత శరీరములనువలె తమ భార్యలను ప్రేమింప బద్ధులైయున్నారు. తన భార్యను ప్రేమించువాడు తన్ను ప్రేమించుకొనుచున్నాడు. తన శరీరమును ద్వేషించినవాడెవడును లేడుగాని ప్రతివాడును దానిని పోషించి సంరక్షించుకొనును. ఈ హేతువుచేత పురుషుడు తన తండ్రిని తల్లిని విడిచి తన భార్యను హత్తుకొనును; వారిద్దరును ఏకశరీర మగుదురు" (ఎఫెసీ 5 : 25-31).

స్త్రీ యథార్థంగా తన భర్తను ప్రేమించినయెడల, లేక ప్రేమించుట నేర్చుకొనిన యెడల, మిగిలిన అన్ని విషయములలో భార్యగా యుండుటకు ఆమె ఎదుగును. లేఖనాల్లో ప్రేమ అనే పదము భావ రహితమైన వ్యామోహం కాదు గాని ప్రేమింపబడు వ్యక్తికి ఏది శ్రేష్టమైనదో దానిని కోరునట్టిది. ఇట్టి ప్రేమ గలిగిన స్త్రీ తన భర్త యొక్క అవసరాలను నెరవేర్చుటకు మనస్ఫూర్తిగా ప్రయత్నింప గలదు. అతనికి సంతోషదాయకమైన దేదో గ్రహించి, అతని సంతోషపెట్టుటకు ప్రయత్నించును. తన ప్రేమను చూపించుటకు ఆమె అతని గృహాన్ని, పిల్లలను, ఆస్థిని జాగ్రత్తగా కాపాడును.

తన భర్తను ప్రేమించు స్త్రీ అతని పనిని గూర్చి, మిత్రులను గూర్చి, భావాలను గూర్చి తెలిసికొన ప్రయత్నించును. అతని జీవితంలోని అన్నిరకాలైన అనుభవాల్లోను ఆమె పాలు పొందగోరును. 1 కొరింథీ 7:3-5 ఇట్లు చెప్పుచున్నది: "భర్త భార్యకును అలాగునే భార్య భర్తకును వారివారి ధర్మములు నడుపవలెను. భర్తకే గాని భార్యకు తన దేహముపైని అధికారము లేదు; అలాగున భార్యకే గాని భర్తకు తన దేహముపై అధికారము లేదు. ప్రార్థన చేయుటకు మీకు సావకాశము కలుగునట్లు కొంత కాలమువరకు ఉభయుల సమ్మతి చొప్పుననే తప్ప, ఒకరి నొకరు ఎడబాయకుడి; మీరు మనస్సు నిలువ లేక పోయినప్పుడు సాతాను మిమ్మును శోధింపకుండునట్లు తిరిగి కలిసికొనుడి".

గనుక భర్తను ప్రేమించే తరుణము, బాధ్యత భార్యదే. ప్రేమించుటలో అతనియొక్క భౌతిక, మానసిక, భావోద్రేక అవసరాలను తీర్చగలదు. ఆమె తనకుగాని తన కుటుంబానికిగాని గాక తన భర్తకే చెందును. తన భర్త ఆమెకే చెందును, వారిద్దరు కలసి వివాహములో దేవుడు సంకల్పించిన పవిత్రమైన, నిస్వార్థమైన, మనోహరమైన ఏకత్వమును సాధించుటకు కొనసాగాలి.

— బెట్టీ ఫోట.

విశ్వాస వీరులు - 8

# మోషే - 1

## *(Moses)*

"మోషే పెద్దవాడైనప్పుడు, విశ్వాసమును బట్టి ఐగుప్తు ధనము కంటె క్రీస్తు విషయమైన నింద గొప్ప భాగ్యమని యెంచుకొని, అల్ప కాలము పాపభోగము అనుభవించుటకంటె దేవుని ప్రజలతో శ్రమ అనుభవించుట మేలని యోచించి, ఫరో కుమార్తెయొక్క కుమారుడని అనిపించుకొనుటకు ఒప్పుకొనలేదు; ఏలయనగా అతడు ప్రతిఫలముగా కలుగబోవు బహుమానమునందు దృష్టి యుంచెను" (హెబ్రీ 11 : 24-26).

మోషే జీవితమునుండి నిశ్చయతలు గైకొను విషయంలో గొప్ప పాఠాలను మనం నేర్చుకోవచ్చును. ఎంపిక చేసికొను విషయాలతో మన జీవితాలు నిండియుంటాయి. ఒక్కోసారి అతి తేలికగా సూక్ష్మంగా కనబడే నిశ్చయతే, మన జీవితాల గమ్యాన్ని స్థిరపరుస్తాది. మోషేయొక్క గమ్యాన్ని మార్చిన నిశ్చయతను, అతని నిశ్చయతలకు వెనుకనున్న అంతర్యాన్ని గమనిద్దాం.

1. మోషే ఫరో కుమార్తెయొక్క కుమారుడని అనిపించుకొనుటకు ఒప్పుకొనలేదు. నిజానికి మోషే, ఫరో కుమార్తెయొక్క కుమారుడుకాదు గాని ఆమె అతన్ని పెంచుకొన్నది. గనుక అతనికి అన్ని సౌకర్యాలు సంక్రమించాయి. ఐగుప్తు దేశానికి పాలకునిగా అయ్యే తరుణాన్నికూడ అతడు విసర్జించాడు.

2. మోషే పాపభోగము అనుభవించుటకు నిరాకరించాడు. పాపపు శోధనే అల్పకాల భోగమును గూర్చిన శోధన. పాపములో ఒక రకమైన భోగము లేకపోతే, శోధన ఇంకెందులో యుంటాది! ఐగుప్తుదేశములో అత్యున్నతుడైన స్థానములో మోషే యున్నందువలన, తన శారీరక యిచ్ఛలన్నిటిని అతడు సునాయాసముగా తీర్చుకో

గలిగి యుండును. అవినీతి వాతావరణంలో జీవిస్తు పాపపు జీవి జీవించడం ఏమంత కష్టము కాకపోవుచు. అయితే మోషే అట్టి పాప జీవితం జీవించుటకు తిరస్కరించాడు.

3. మోషే శ్రమలనుభవించుటకు నిశ్చయించుకొన్నాడు. ఫరో కుమార్తెయొక్క కుమారుడనిపించుకొనుటకు మోషే ఎప్పుడైతే నిరాకరించాడో, వెంటనే అతడు శ్రమలనుభవించుటకు ఎంచుకొన్నాడు. ఐశ్వర్యములోకంటె బీదవానిగా జీవించుట కతడు ఎంచుకొన్నాడు. సుఖం కంటె శ్రమను, కష్టతరమైన పనిని అతడు ఎంచుకొన్నాడు.

4. అన్ని సౌకర్యాలు కలిగిన మార్గము అతి సులువుగా దొరుకుచున్నప్పుడు ఎవడైనను కష్టతరమైన అట్టి మార్గాన్ని ఎందుకు ఎంచుకొంటాడు? ప్రయాణించుటకు కష్టతరమైన మార్గాన్ని ఎంచుకొనుటలో మోషే ఆంతర్యం యేమిటి? హెబ్రీ పత్రిక లేఖకుడు మనకు జవాబు యిస్తున్నాడు: "ఏలయనగా అతడు ప్రతిఫలముగా కలుగబోవు బహుమానమందు దృష్టి యుంచెను".

మోషే తనకు ముందున్న పితరులవలె, "దేవుడు దేనికి శిల్పియు నిర్మాణకుడునై యున్నాడో పునాదులు గల ఆ పట్టణముకొరకు ఎదురుచూచాడు" (హెబ్రీ 11:10). పాపమువలన కలుగు భోగం తాత్కాలికమైనదని, మద్యమువలె చివరకది సర్పమువలె కరచును కట్లపామువలె కాటు వేయునని మోషే ఎరుగును.

— డేవిడ్ జాన్సన్.

---

## నానావిధాలుగా దేవుడు మనతో మాట్లాడుచున్నాడా?

### (*Does God Speak to us in many Voices?*)

బైబిలులోనున్న ఒక్క వచనముతో ఈ ప్రశ్నకు మనం జవాబీయవచ్చును. నేడు దేవుడు అనేక విధాలుగా మాట్లాడుచున్నా

కొందరు చెబుతున్నారు. హెబ్రీ 1:1, 2లో ఈలాగు వ్రాయబడి యున్నది: "పూర్వకాలమందు నానా సమయములలోను నానావిధములుగాను ప్రవక్తలద్వారా మన పితరులతో మాటలాడిన దేవుడు, ఈ దినముల అంతమందు కుమారునిద్వారా మనతో మాటలాడెను". తన తండ్రి యిచ్చిన మాటలను పలుకడానికి క్రీస్తుకు ఒకేఒక్క స్వరమున్నది. ఆయన బైబిలులో మనతో మాటలాడుచున్నాడు.

మోషేవంటి ప్రవక్తను దేవుడు లేపునని మోషే చెప్పాడు. 'ఆయనమాట నీవు వినవలెను' (ద్వితీ 18:16). అపొస్తలుడైన పేతురు ఈ ప్రవచనాన్ని ఎత్తుకొని యేసే ఆ ప్రవక్తయని చూపించాడు. ప్రజలు ఆయనమాట వినాలని అతడు చెప్పాడు (అపో.కా. 3:22-26). నేడు దేవుని ప్రవక్త ఇంకొకడెవడు లేడు.

యేసే ఆ ప్రవక్త. ఆయన ఒకే స్వరముతో ఒకే వర్తమానాన్ని కలిగియున్నాడు. అందుకే "మీరేమి వినుచున్నారో జాగ్రత్తగా చూచుకొనుడి" యని ఆయన హెచ్చరిక చేసాడు (మార్కు 4:24). తరువాత, "మీ రేలాగు వినుచున్నారో చూచుకొనుడి" యని ఆయన మనలను హెచ్చరించుచున్నాడు (లూకా 8:18). అనేక స్వరాలు వినబడతాయని ఆయన ఎరుగును. గాని అవి ఆయనవి కాదు. ఈనాడు అనేక స్వరాలు వినబడుచున్నను, అవి మోసకరమైనవి.

గెత్సేమనెలో యేసు ప్రార్థించుచు తన అపొస్తలులను గూర్చి ఈలాగు చెప్పాడు: "నీవు నాకు అనుగ్రహించినవన్నియు నీవలననే కలిగినవని వారిప్పుడు ఎరిగి యున్నారు" (యోహాను 17:8). ఆ అపొస్తలులలో పేతురొకడు. అతడు తండ్రియిచ్చిన మాటలనే అపో. కా. 2లో పలికాడు. వారిని సర్వసత్యములోనికి పరిశుద్ధాత్ముడు నడుపుననుమాట సత్యమే (యోహాను 16:7-13). అయితే ఆయన తనంతట తానే మాటలాడక తండ్రి యేమిచెప్పెనో వాటినే పలికెను (యోహాను 16:13).

అపొ.కా. 2:1-4 లో చెప్పబడినట్లు పరిశుద్ధాత్ముడు వారిని నడిపించినట్లు చూడగలము. ఈ సందర్భములోనే పేతురు యోవేలు చేసిన ప్రవచనములను గూర్చి వారికి చెప్పనారంభించాడు. ఆ ప్రవచనము యోవేలు 2:28-32లో మనకు కనబడును. తరువాత ఆ ప్రవచనాన్ని తన వర్తమానముతో సమన్వయించాడు. పరిశుద్ధాత్మావేశముతో పేతురు ఆ వర్తమానాన్ని ప్రకటించాడు. యేసు యిచ్చిన సార్వజనిక ఆజ్ఞ ననుసరిస్తూ అతడాయన స్వరానికి లోబడ్డాడు: "మీరు సర్వలోకమునకు వెళ్ళి సర్వసృష్టికి సువార్తను ప్రకటించుడి. నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును; నమ్మనివానికి శిక్ష విధింపబడును" (మార్కు 16:15, 16). అపొస్తలుల పనియందంతట వారు ఈ ఒకే స్వరాన్ని అనుసరించారు.

అపొ.కా. 2:38లో పేతురు, వారి పాపములకు విరుగుడును యిచ్చాడు. వారు విన్న ఒకేఒక్క స్వరము అతనిదే, అది ఈ యుగ సమాప్తివరకు సరిపడును. ఆ ఒకే స్వరాన్ని మనం ఇంకా వినగలము. ప్రకటన 22:17-19లో అది వ్రాయబడియున్నది. దేవుని మాటలను మార్చరాదని హెచ్చరిక చేయబడింది. అందరు యేసు శబ్దమును వినే ఒక్క ఘడియ వచ్చుచున్నది గాని అది రక్షణ వర్తమానము కాదు (యోహాను 5:27-29). కాలము గతించిపోయినప్పుడు మానవులందరు ఆ ఒకేఒక్క స్వరాన్ని వినివలసియున్నది.

—తోమస్ బోరె

---

సంక్షిప్త ప్రసంగము :

## బైబిలులో బుద్ధిహీనులు

*(Fools in the Bible)*

బుద్ధిహీనుడు : తెలివి లేనివాడు, వెర్రివాడు; తెలివి ఉన్నా వినియోగించనివాడు.

1. సిలువ కొరకు అపొస్తలులు బుద్ధిహీనులయ్యారు :
   - వారు క్రీస్తుకు నమ్మకముగా యుండిరి.
   - సిలువ వేయబడిన క్రీస్తును ప్రకటించిరి.

     1 కొరింథీ 1 : 18-25.

   - లోకము వారిని వెర్రివారిగా భావించింది.

2. దేవుడు లేడను వారు :
   - కీర్తన 14:1; 53:1.
   - మానవుడు అన్నిచోట్ల ఒకే సమయమందుండి, సమస్తాన్ని ఎరిగినవాడై తేనేగాని దేవుడు లేడని చెప్పజాలడు.
   - దేవుడున్నాడని విశ్వసించాలి. హెబ్రీ 11:6.

3. జ్ఞానాన్ని, వివేచనను నిరాకరించువారు :
   - సామె 1:7, 8, 22:31; 15:5; 18:2.
   - దేవుని గూర్చిన జ్ఞానం అత్యవసరం.
   - యెహోవాయందు భయభక్తులు కలిగి యుండుట తెలివికి మూలము.

4. తమ స్వజ్ఞానంపై నమ్మిక యుంచువారు :
   - సామె 28 : 26; 12 : 15; యిర్మియా 17 : 9; 10 : 23.
   - స్వనీతి పరుడైన పరిసయ్యుడు, దేవుని దృష్టిలో బుద్ధిహీనుడు. లూకా 18 : 9-14.

5. ఈ లోక సంగతులయందు నమ్మిక యుంచువారు :
   - వెర్రివాడైన ధనవంతుడు. లూకా 12:16-21.
   - దేవుని రాజ్యములో ప్రవేశించుట దుర్లభము.

     మార్కు 10 : 23-25

   - ధనవంతులు అస్థిరమైన ధనమునందు కాక దేవునియందే నమ్మిక యుంచాలి. 1 తిమో 6:17.

6. వాక్యాన్ని విని దాని ప్రకారం చేయనివారు :

- మత్తయి 7 : 24-27
- వాక్యప్రకారం చేయకపోతే స్వకీయ మోసమే. యాకోబు 1:22
- అది పాపము. యాకోబు 4:17.

ముగింపు : నిన్ను నీవే పరీక్షించుకో

- నీవు బుద్ధిగలవాడవా ? బుద్ధిహీనుడవా ?
- క్రీస్తు నొద్దకు రమ్ము. బుద్ధిమంతుడవు కమ్ము.

---

## బైబిలు బాప్తిస్మంకొరకు 7 కారణాలు

## *(Seven Reasons for Bible Baptism)*

**1. అది ఆజ్ఞాపింపబడినది :** "యేసుక్రీస్తు నామమందు వారు బాప్తిస్మము పొందవలెనని ఆజ్ఞాపించెను" (అపొ.కా. 10:48). దేవుని ఆజ్ఞలకు విధేయత చూపుట అత్యవసరం. ఆయనకు విధేయులైన వారందరికి నిత్యరక్షణకు క్రీస్తు కారకుడు (హెబ్రీ 5:8, 9).

**2. క్రీస్తు దాన్ని బోధించాడు :** "నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును; నమ్మనివానికి శిక్షవిధించబడును" (మార్కు 16:16). క్రీస్తు బోధించినదాన్ని మనం వినాలి, లోబడాలి. "కాబట్టి యీ నా మాటలువిని వాటి చొప్పునచేయు ప్రతివాడును బండమీద తన యిల్లు కట్టుకొనిన బుద్ధిమంతుని పోలియుండును" (మత్త 7:24).

**3. అపొస్తలులు దాన్ని బోధించారు :** పౌలు కొరింథులో బోధించినప్పుడు "కొరింథీయులలో అనేకులు విని విశ్వసించి బాప్తిస్మము పొందిరి" (అపొ.కా. 18:8). పెంతెకొస్తునాడు యూదులకు పేతురు ఇట్లు చెప్పాడు : "మీరు మారుమనస్సుపొంది, పాప

క్షమాపణనిమిత్తము ప్రతివాడు యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి; అప్పుడు మీరు పరిశుద్ధాత్మ అను వరమును పొందుదురు" (అపొ.కా. 2:38).

4. అదొక విశ్వాస క్రియ : "మీరు బాప్తిస్మమందు ఆయనతో కూడ పాతిపెట్టబడినవారై ఆయనను మృతులలోనుండి లేపిన దేవుని ప్రభావమందు విశ్వసించుటద్వారా ఆయనతో కూడ లేచితిరి" (కొలస్స 2:12). విశ్వాసము ప్రయోజనకారి కావాలంటే ప్రేమ వలన కార్యసాధకం కావాలి (గలతీ 5.6). దేవునివాక్యం చెప్పు రీతిగా బాప్తిస్మమునకు లోబడినప్పుడు ఆయనయందలి విశ్వాసాన్ని మనం నిరూపించుచున్నాము.

5. అది మనలను ఆయన శరీరంలో ప్రవేశింపజేస్తాది: "మనమందరము ఒక్క శరీరములోనికి ఒక్క ఆత్మయందే బాప్తిస్మము పొందితిమి" (1 కొరింథీ 12:13) ఆ ఒక్క శరీరములోనికి మనము బాప్తిస్మము పొందితే, బాప్తిస్మము పొందనివారు ఆ శరీరమునకు అనగా క్రీస్తు సంఘమునకు వెలుపల యున్నారు.

6. అది పాపికి రక్షణకు మధ్య నిలచియున్నది : అననీయ సౌలుతో ఇట్లు చెప్పెను : "గనుక నీవు తడవు చేయుట ఎందుకు? లేచి ఆయన నామమునుబట్టి ప్రార్థనచేసి బాప్తిస్మముపొంది నీ పాపములను కడిగివేసికొనుము" (అపొ.కా. 22:16). "దానికి సాదృశ్యమైన బాప్తిస్మము ఇప్పుడు మిమ్మును రక్షించుచున్నది; అదేదనగా శరీర మాలిన్యము తీసివేయుటకుకాదు గాని యేసుక్రీస్తు పునరుద్ధానమూలముగా దేవుని విషయము నిర్మలమైన మనస్సాక్షినిచ్చు ప్రత్యుత్తరమే" (1 పేతురు 3:21).

7. క్రీస్తును ధరించుకొనే మార్గమది : "యేసుక్రీస్తునందు మీరందరు విశ్వాసమువలన దేవుని కుమారులై యున్నారు. క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిన మీరందరు క్రీస్తును ధరించుకొనియున్నారు"

(గలతీ 3:26, 27) క్రీస్తును ఎంతమంది ధరించుకొన్నారు? క్రీస్తులోని బాప్తిస్మముపొందిన వారందరు. అంతకుతక్కువ కాదు, ఎక్కువ కాదు!

—బాబీ [illegible]

---

## క్రైస్తవుడవు కాగోరుచున్న యెడల....

I నీవు మొదట దేవుని వాక్యమును విని దేవునియందును క్రీస్తు[illegible] నందును విశ్వాస ముంచవలెను :

1. కాగా వినుట వలన విశ్వాసము కలుగును. వినుట క్రీస్తును గూర్చిన మాటవలన కలుగును (రోమా 10:17; యోహాను 20:30-31).

2. విశ్వాసము లేకుండ దేవునికి ఇష్టుడై యుండుట అసాధ్యము దేవుని యొద్దకు వచ్చువాడు ఆయన యున్నాడనియు తన్ను వెదకు వానికి ఫలము దయచేయు వాడనియు నమ్మవలెను గదా. (హెబ్రీ 11 : 6).

3. మీరు దేవుని యందు విశ్వాసముంచుచున్నారు. నా[illegible] యందును విశ్వాసముంచుడి (యోహాను 14 : 1).

నేను ఆయనని మీరు విశ్వాసముంచని యెడల మీరు మీ పాపములోనేయుండి చనిపోవుదురని యేసు చెప్పెను (యోహాను 8:24).

II నీ పాపముల విషయమై మారుమనస్సు పొందుము :

1. మీరు మారు మనసు పొందని యెడల మీరందరును అలాగే నశింతురు (లూకా 13 : 5).

2. ఆ అజ్ఞాన కాలములను దేవుడు చూచి చూడనట్లుగా ఉండెను. ఇప్పుడైతే అంతటను అందరును మారుమనస్సు పొందవలెనని మనుష్యులకు ఆజ్ఞాపించుచున్నాడు (అపొ.కా. 17:30).

I యేసుక్రీస్తు నామమును మనుష్యుల ఎదుట ఒప్పుకొనవలెను :

1. మనుష్యుల ఎదుట నన్ను ఒప్పుకొను వాడెవడో పరలో[illegible]

మందున్న నా తండ్రి యెదుట నేనును వానిని ఒప్పుకొందును. మను
ష్యుల యెదుట ఎవడు నన్ను ఎరుగననునో వానిని పరలోకమందున్న
నా తండ్రి యెదుట నేను యెరుగనందును అని యేసు చెప్పెను.
(మత్తయి 10:32- 3).

IV నీవు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందవలెను :

1. మీరు మారుమనస్సుపొంది పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడును యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి. అప్పుడు మీరు పరిశుద్ధాత్మ అను వరమును పొందుదురు (అపొ.కా. 2:38).

2. గనుక నీవు తడవుచేయుట ఎందుకు? లేచి ఆయన నామమునబట్టి ప్రార్థనచేసి బాప్తిస్మముపొంది నీ పాపములను కడిగివేసికొనుము (అపొ.కా. 22:16).

3. దానికి సాదృశ్యమైన బాప్తిస్మము ఇప్పుడు మిమ్మును రక్షించుచున్నది (1 పేతురు 3:21).

4 క్రీస్తులోనికి బాప్తిస్మముపొందిన మీరందరు క్రీస్తును ధరించుకొని యున్నారు (గలతీ 3:27).

V. నీవు పై విషయములకు లోబడినయెడల క్రైస్తవుడ వగుదువు. క్రీస్తు సంఘములో చేర్చబడుదువు.

1. కాబట్టి అతని వాక్యము అంగీకరించినవారు బాప్తిస్మము పొందిరి. ఆ దినమందు ఇంచుమించు మూడు వేలమంది చేర్చబడిరి (అపొ.కా. 2:41-47).

2. మనమందరము ఒకే శరీరములోనికి ఒకే ఆత్మయందే బాప్తిస్మము పొందితిమి (1 కొరింథి 12:13).

క్రీస్తుసంఘములో చేర్చబడిన తరువాత నమ్మకమైన క్రైస్తవులతో స్థానిక క్రీస్తుసంఘములో నీవు ఆయనను ఆరాధించి ఆయనకు పనిచేయవలయునని దేవుడు నిన్ను కోరుచున్నాడు. అట్లు చేయుటలో దేవుడు నిన్ను నీ జీవితమును అంగీకరించును.

—U. విజయకుమార్, రాచపూడి.

# బైబిలు సంభాషణ

ప్రశ్న : పిల్లలను సరియైన మార్గములో ఎలా పెంచాలి?

జవాబు: సొలొమోను ఈలాగు చెప్పాడు: "బాలుడు నడువవలసిన త్రోవను వానికి నేర్పుము. వాడు పెద్దవాడైనప్పుడు దాని నుండి తొలగిపోడు" (సామె 22:6).

పిల్లలను క్రమశిక్షణ లేకుండా వదిలేస్తే తలిదండ్రులకు వారు దుఃఖాన్ని కలుగజేస్తారు. బాలుడు నడువవలసిన త్రోవను తలిదండ్రులు వానికి నేర్పాలి. తనకు తానే నేర్చుకోలేకన్నా తలిదండ్రులు వానికి నేర్పాలి. "తండ్రులారా, మీ పిల్లలకు కోపము రేపక ప్రభువుయొక్క శిక్షలోను బోధలోను వారిని పెంచుడి" (ఎఫెసీ 6:4).

దేవుడు నియమించిన మూడు సంస్థలగు గృహము, సంఘము, ప్రభుత్వములలో గృహమే మొదట వస్తాది. భక్తిగల కుటుంబాలపై మన దేశముయొక్కయు ప్రపంచముయొక్కయు పరిస్థితి ఆధారపడి యుంటాది.

---

Regd. No. H/KD—45/KD. H.O

*From*
SATYA WAKKU
P.O. Box. 80
KAKINADA-533 001

To

..............................

..............................

..............................

..............................